# బొమ్మ

మాలతికి మతిపోయినంత పనయింది. కొంతసేపు దాదాపు ఊపిరి స్థంభించినట్లనిపించింది. అది పీడకలకాదు! వాస్తవం!!

ఆ బొమ్మను ఎంతో జాగ్రత్తగానే తీసింది. టవల్‌తో తుడిచేటపుడు ఎక్కడ జారిపడిపోతుందోనని బల్లమీద ఆన్చిమరీ, శుభ్రం చేసింది. అతి జాగ్రత్తగా యధాస్థానంలో వుంచబోయింది. అంతే!!

టేబిలు మూలకు చేయిరాసుకుని లటుక్కున జారికిందపడిపోయింది. బొమ్మ ముక్కలయిపోయింది. నీరసంగా కుర్చీలో చేరగిలబడిపోయింది మాలతి.

ఆమె కన్నుల్లో నీళ్ళు తిరిగేయి.

నేలమీది ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ముక్కలు తనవంక చూసి వికృతంగా నవ్వుతున్నట్లని పించింది ఆమెకు.

ఒకటీ... రెండూ... కాదు సుమారు పది, పన్నెండు ముక్కలయిపోయింది ఆ బొమ్మ! రెండు నిమిషాలు క్రితం వరకూ టేబిలు మీద అందంగా వున్న కృష్ణుని సుందర విగ్రహం, ఈ క్షణంలో నేలమీద చెదురుమదురుగా ముక్కలయి పడివుంది. అయిదు నిమిషాలబాటు చేష్టలుడిగి పోయాయి ఆమెకు! తర్వాత మెల్లగా లేచి నేలమీది ముక్కలన్నీ ఎత్తి టేబిలు మీద పోసింది. వాటిని దగ్గరగా చేర్చి, ఒక ఆకారం తీసుకు రావటానికి శతవిధాల ప్రయత్నించింది.

సాధ్యం కాలేదు! అది సాధ్యమయ్యే పనికాదని మాలతికి తెలుసు. ఒకటి రెండు చోట్ల పగిల్తే దేనితోనయినా అతకవచ్చు! కానీ, ముక్కలు ముక్కలుగా అయిపోయి, ఏ భాగం ఎక్కడ నుండి వూడిపోయిందో కూడా తెలుసుకోవటం సాధ్యంకాలేదు.

ఎంత ఆపుకున్నా ఆగని కన్నీళ్ళు బయటకు ఉరికి వచ్చేయి. నీళ్ళు నిండిన కళ్ళతో గడియారం వంకకు చూసింది. మూడుంపావు అయింది. అంటే సుమారు ఇంకో గంటన్నర సమయంలో భర్తవస్తాడు. ఆయనకు ఏమని చెప్పటం?

బొమ్మ ఎలా పగిలిందని అడిగితే ఏం సమాధానం ఇవ్వాలి?

తన సమాధానం అతడు నమ్ముతాడా? ఉహూ! లాభంలేదు!! అతడు నమ్మడు!!

అసలు తన సమాధానం కోసం కూడా ఆగకుండా. ముక్కలయిపోయిన బొమ్మను చూసి, తనపై విరుచుకుని పడటం ఖాయం. మాలతి నిలువెల్లా వణికిపోయింది.

భర్త శ్రీధర్‌కు ఆ బొమ్మంటే ప్రాణం. తనను కాపురానికి తీసుకు వచ్చిన మొదటిరోజున, అంటే కేవలం పదిరోజుల క్రితం అతడు ఆ విషయాన్ని చెప్పేడు. "చూడు మాలతీ! నేనూ, అరుణా కేవలం పదహారు నెలలు మాత్రమే కలిసి వున్నాం. మా అన్యోన్య దాంపత్యం చూడలేక భగవంతుడు అరుణను తన వద్దకు తీసుకున్నాడు. ఆ కొద్దినెలలలోనే వంద సంవత్సరాల ప్రేమనూ, వేయి సంవత్సరాల అనురాగాన్నీ నాకు

ఇచ్చింది అరుణ. అయితే, అదంతా నా జీవితంలో ఒక కలలా గడిచిపోయింది. నువ్వు ఈనాడు నా జీవితంలోనికి అడుగు పెట్టావు. నిన్ను పూర్తి మనసుతో ప్రేమిస్తాను. పాత జ్ఞాపకాలను దూరం చేసుకునేందుకు మాత్రం నాకు కొంత సమయం కావాలి. దయచేసి నన్ను వేరేధోరణిలో అర్థం చేసుకోకు." కొంతసేపు మాటలు ఆపి తనవంకే చూస్తూ వుండిపోయాడు. తర్వాత మళ్ళీ చెప్పటం ఆరంభించేడు.

"ఒకప్పుడు ఈ ఇంట్లో ప్రతి వస్తువు అరుణ రూపాన్నీ ఉనికినీ గుర్తుకు తెచ్చేవి. కానీ నిన్ను పెళ్ళిచేసుకునే ముందు వాటన్నిటినీ తొలగించేను. ఆఖరికి అరుణఫోటో కూడా తీసి పెట్టెలో పెట్టేశాను. అదంతా, నిన్ను నిండు మనసుతో నా జీవితంలోనికి ఆహ్వానించడానికి మాత్రమే. నేను నిన్ను నిరాదరిస్తున్నానని అనుకోకుండా వుండటానికి మాత్రమే. అయితే, ఈ ఒక్క బొమ్మ మాత్రం నాకు ప్రాణంతో సమానం..." అంటూ టేబిలు మీది కృష్ణుని విగ్రహం తీసి చూపించేడు. తర్వాత మళ్ళీ అన్నాడు. "అరుణ గొప్ప కళాకారిణి,ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో బొమ్మలు గొప్పగా తయారు చేసేది. ఈ కృష్ణుని విగ్రహం ఆమె ఎంతో శ్రమించి తయారుచేసి నాకుపెళ్ళిరోజున కానుకగా ఇచ్చింది. దీన్ని మాత్రం అరుణ గుర్తుగా దాచుకున్నాను. దీన్ని జాగ్రత్తగా వుంచు" శ్రీధర్ ఆవేళ చెప్పిన మాటలన్నీ పదే పదే కదలాడేయి మాలతి మనసులో.

ఆ దినం భర్త ఆ మాటలు చెప్తూవుంటే తన కళ్ళు చెమర్చేయి.

అరుణను మరిచిపోయి తనను ప్రేమించేందుకు అతడు చేసే ప్రతి ప్రయత్నమూ ప్రతిమాటలోనూ విన్పించింది. ఆ దినం నుండీ ఈ దినం వరకూ ప్రతి కదలికలోనూ కనిపిస్తోంది. భర్త సంస్కారానికీ, మంచితనానికీ జోహారనకుండా వుండలేకపోతోంది.

రెండోపెళ్ళి వాడనే భయంతో తాను వివాహజీవితంలోనికి ప్రవేశించింది. అయితే, ఆ భయం మొదటిదినాన్నే పోయింది. ఏలోటూ లేకుండా తనను చూసుకుంటున్నాడు శ్రీధర్. తాను ఆనాడే అతడికి మాట ఇచ్చింది. "మీకు విలువయిన వస్తువు నాకూ ప్రాణప్రదమే! స్వర్గానికి వెళ్ళిపోయిన అక్కయ్య నాకు రెండు కానుకలను మిగిల్చింది. ఒకటి మీరు! రెండోది ఈ బొమ్మ" అంటూ అతడి ఛాతీపై ఒదిగిపోయింది.

ఆ బొమ్మకూ, తన భర్తకూ అంతటి అనుబంధం వుంది. కాదు– వుండేది!!

పదినిమిషాల క్రితం, అదికాస్తా ముక్కలయిపోయింది. ఈ తప్పుకు తనభర్త తనను క్షమించడు. ఈ వేళ్టివరకూ భర్తలోని అనురాగాన్నే చూసిందికానీ కోపాన్ని చూడలేదు. ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవటం? ఏదో, గట్టి కారణం ఆలోచించి చెప్పాలి! అబద్ధం ఆడాలి! తప్పదు!! ఏమని చెప్పటం?

'ఈ ముక్కలన్నింటినీ దూరంగా విసిరేసి, బొమ్మను ఎవరో దొంగిలించి తీసుకుపోయారని చెప్తే?'

వీధి వరండాకు ఆనుకునే బెడ్‌రూం వుంది. తాను పెరట్లో బట్టలు ఆరేస్తున్న

సమయంలో తలుపు వేయటం మరిచిపోతే, ఎవరయినా సులువుగా లోనికి వచ్చి బొమ్మను తీసుకు పోవచ్చును. కానీ, తన బంగారపు గొలుసువాచీ, ఇంకా చిన్న చిన్న విలువయిన వస్తువులు అన్నీ ఆ టేబిలు మీదే వుంటాయి.

వాటన్నిటినీ వదిలి, ఈ బొమ్మను మాత్రమే దొంగిలించుకుపోయారని చెప్తే భర్త నమ్ముతాడా? ఉహూ! లాభంలేదు! నమ్మడు!! భర్తేకాదు, ఎవ్వరూ నమ్మరు! సరికదా, నవ్వుతారు!!

భర్తకు ఆ బొమ్మ ప్రాణప్రదంకానీ, మిగిలిన వాళ్ళకు కాదుకదా!!

కొంతసేపు ఏమీపాలుపోలేదు మాలతికి!

పోనీ తుడుస్తూ వుంటే, చేజారిపడిపోయి పగిలిపోయిందని నిజం చెప్పేస్తే?

భర్త నమ్మక పోవచ్చు!!

అరుణపైన అకారణంగా ద్వేషం పెంచుకుని, కేవలం మాత్సర్యంతోనే ఈ పనిచేసినట్లు అనుకుంటాడు. తనకు మిగిలిన ఒక్క జ్ఞాపకాన్నీ దూరం చేయటానికి ప్రయత్నించినట్లు అనుమానిస్తాడు.

ఇదీ లాభంలేదు! ఇంకేమయినా కారణం ఆలోచించాలి. అంతలోనే టామీ తోకాడించుకుంటూవచ్చి కాళ్ళదగ్గర నిలబడింది. తాను ఎంతకూ దాన్ని పిలవకపోవటం గమనించి, చెంగున టేబిలు మీదకు దూకి కూర్చుంది. తరువాత మాలతి మోచేతిని నాటకం ఆరంభించింది.

మెరుపులా ఒక ఆలోచన వచ్చింది మాలతికి.

టామీ టేబిలు మీదకు దుమికి బొమ్మను తోసేసిందని చెబితే సరిపోతుంది. దానికి ఇంక తిరుగుండదు.

అయితే, ఒక్క క్షణంలోనే ఆ ఆలోచన కూడా తేలిపోయింది.

టేబిలు గోడకు ఆన్చివుంది. గోడకు చాలా దగ్గరగా వుంటుంది ఆ బొమ్మ. కుక్క తోసేసినా టేబిలు మీదేపడాలి తప్ప నేలమీద పడిపోయే అవకాశం లేదు. టేబిలు మీద పడినా ఇన్నిముక్కలుగా పగిలిపోయే అవకాశం అసలులేదు. పోనీ పనిమనిషి గది ఊడుస్తూ వుండగా దాని చేయి తగిలికిందపడి పోయిందని చెప్తే? పనిమనిషిని బ్రతిమాలుకోవచ్చు. దానిచేతిలో ఒక రూపాయి పెడితే తానే పగలగొట్టినట్లు ఒప్పుకుంటుంది. కానీ, ఆ విషయం కూడా భర్త నమ్మడు. ఎందుకంటే తాను కాపురానికి వచ్చిన మొదటిరోజునే పనిమనిషి తమ బెడ్‌రూం తుడుస్తువుంటే వద్దని తానే వారించింది.

'ఈగది మనిద్దరికే పరిమితం. ఇందులోనికి వేరెవ్వరూ రావటానికి వీలులేదు. ఈ గదిని నేనే స్వయంగా శుభ్రం చేసుకుంటాను' అంది భర్తతో.

'అలాగే మాలతీ' నీ ఇష్టానికి అడ్డుచెప్పను' అన్నాడు భర్త.

ఇది జరిగేక ఈ మధ్య రోజుల్లో పనిమనిషి ఏనాడూ తమ గదిలో అడుగుపెట్టలేదు.

మరి, ఈవేళ ఎందుకు వెళ్ళిందని అడిగితే?

ఏమని చెప్పటం? ఉహు, లాభంలేదు. భర్త ఆఫీసునుండి వచ్చేక అతిభయంకరమయిన పరిస్థితి ఎదురవుతుంది. దాన్ని తట్టుకునేందుకు తాను సిద్ధం కావాలి. కానీ,ఎలా?

గుండె గుబగుబలాడుతోంది

టేబిలు మీది న్యూస్‌పేపరు చేతిలోనికి తీసుకుని చదవటానికి యత్నించింది. ఉహూ. మనసు నిలవటం లేదు!! వంటింట్లోకి వెళ్ళి, కాఫీ కలిపి, ఫ్లాస్కులో పోద్దామని అనుకుంది. కానీ, కుర్చీలో నుండి లేవలేకపోయింది. కాళ్ళు నేలకు అంటుకున్నట్లుగా వుండిపోయాయి. గడియారం వంక చూసింది. నాలుగున్నర కావొస్తోంది. శ్రీధర్ ఆఫీసునుండి తిరిగి వచ్చే సమయం దగ్గర పడింది. ఏ నిమిషాన్నయినా, అతడువస్తాడు. టేబిలు మీది ముక్కలు చూస్తాడు ఏమయిందని అడిగితే, ఏమి చెప్పటం? వణికే చేతులతో ఆ ముక్కలను తడిమింది

అంతలోనే

గేటు తెరిచిన చప్పుడయింది. బెదురుగా వీధివంకకు చూసింది. శ్రీధర్ చిరునవ్వుతో లోనికి వచ్చేరు!

"హాయ్, మాలతీ! అలా వున్నావేం?" అంటూపలుకరించేడు.

తరువాత టేబిలు మీది ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ముక్కల్ని చూస్తూ క్షణంసేపు నిలబడిపోయాడు.

"ఏమండీ! నన్ను క్షమించండి! పొరపాటున చేయి జారి బొమ్మ బద్దలయి పోయింది"

మాలతీ శ్రీధర్ భుజాలపై వాలి ఏడ్వటం మొదలు పెట్టింది.

ఆమె కన్నీళ్ళు అతని భుజాన్ని తడిపివేశాయి.

అదురుతున్న ఆమె వేడి పెదాలు అతని భుజంపై కదులుతున్నాయి.

భయంగా కొట్టుకుంటున్న ఆమె గుండె చప్పుడు అతనికి స్పష్టంగా విన్పిస్తోంది.

రెండు నిమిషాలు గడిచిపోయాయి.

అతని రెండు చేతులూ, ఆమె భుజాలపై అనునయంగా కదిలి మరింత దగ్గరగా ఆమెను హత్తుకున్నాయి!!!

★

(యువ మంత్లీ దీపావళి సంచిక 1980)